క్లుప్తంగా

నేడు కురసాల నామినేషన్


ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ తరఫున కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం ఉదయం 10.40 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చే ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి కాకినాడ 2వ డివిజన్ రమణయ్యపేటలోని వైద్యనగర్ వద్ద క్యాంపు కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా ఉదయం 9 గంటలకు కన్నబాబు బయలుదేరనున్నారు. కన్నబాబు క్యాంపు కార్యాలయం నుంచి వినాయక కేఫ్, నాగమల్లి జంక్షన్ మీదుగా స్పెన్సర్ వరకు ర్యాలీ జరగనుంది. అక్కడ నుంచి సర్పవరం జంక్షన్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్వో కార్యాలయం వరకు నడిచి వెళ్లనున్నారు. తమ అభిమాన నాయకుడు కన్నబాబు నామినేషన్ పర్వంలో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని ప్రజలు వేలాదిగా తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రేపు పవమాన హోమం


ప్రత్యేక అలంకరణలో మరకత మణికంఠ

బోట్‌క్లబ్: హనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక గొడారిగుంట రమా సహిత సత్యదేవ మందిరంలో ఈనెల 23న పవమాన హోమం నిర్వహిస్తున్నట్లు మధ్వ పురోహితుడు యాతగిరి మధ్వేష్ ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి దాసాంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తేనెతో అభిషేకము, తమలపాకుల పూజతో పాటు రమా సహిత సత్యదేవులకు పుష్పాలంకరణ జరుగుతుందన్నారు. 9 గంటల నుంచి పవమాన హోమం జరుగుతుందని, 11:30 కు పూర్ణాహుతితో విశేష కార్యక్రమాలు పూర్తవుతాయన్నారు. ఎంతో మహిమాన్వితమైన పవమాన హోమం ద్వారా ఆంజనేయుని అనుగ్రహాన్ని పూర్తిగా పొందగలమని ఆయన వివరించారు. భక్తులు, మధ్వ గృహస్తులు అందరూ పాల్గొనాలని కోరారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: అయ్యప్పస్వామి జన్మ నక్షత్రం ఉత్తర సందర్భంగా ఆదివారం స్థానిక భానుగుడి అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకాలు చేశారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని నూకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్పస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే స్థానిక రామారావుపేట మరకత మణికంఠకు ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో పలు ద్రవ్యాలతో అభిషేకం చేశారు. పీఠం వ్యవస్థాపకుడు నందమూరి వినోద్ ఆధ్వర్యంలో ఈ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పీఠం కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, పబ్బినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిరోముండనం కేసులో బెయిల్ రద్దు చేయాలి

కాకినాడ సిటీ: దళితుల శిరోముండనం కేసులో అప్పటి ఎమ్మెల్యే తోట త్రిమూర్తులుకు కోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని దళిత ప్రజా సంఘాల సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం సాయంత్రం కాకినాడ సుందరయ్య భవన్‌లో సీనియర్ దళిత నాయకుడు అయితాబత్తుల రామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దళిత నాయకులు మాట్లాడారు. దళిత నాయకులు అయినాపురపు సూర్యనారాయణ, భయ్యా రాజేంద్రకుమార్, గుబ్బల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


విద్యుత్ దీపాలంకరణతో సిద్ధం చేసిన రథం

గొల్లప్రోలు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చేబ్రోలులో సోమవారం సీతారాముల రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ధర్మకర్త దామెర వెంకటదివాకర్, ఈఓ అశ్విని ఆదివారం తెలిపారు. రాత్రి 10 గంటలకు నిర్వహించే రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తారన్నారు. భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు.

వైఎస్సార్ సీపీలోకి జోరుగా చేరికలు


రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ సర్పంచ్ ప్రసాద్‌బాబు తదితరులు


ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో కాకినాడ 2వ డివిజన్ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

- ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో
- సర్పవరం మాజీ సర్పంచ్ రాక

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున చేరుతున్నారు. నియోజకవర్గంలోని కీలక నేతలు వరస వలసలు రావడంతో వైఎస్సార్ సీపీ ఫుల్ జోష్‌లో ఉంది. కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని కీలక నేత, గ్రామ మాజీ సర్పంచ్ కొసిరెడ్డి సత్యవరప్రసాద్‌బాబు, సీనియర్ నాయకుడు పుల్ల వెంకన్నబాబు, కామన శివరామకృష్ణ, కిరణ్ తదితరులు జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం రమణయ్యపేటలోని ఎమ్మెల్యే కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

2వ డివిజన్‌లో..

కాకినాడ అర్బన్ 2వ డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు గుత్తుల రాజు, శ్రీను, త్రిమూర్తులు, సత్యనారాయణ, ఆదినారాయణ, వెంకట సత్యనారాయణ, దినేష్, ఎం.సత్యనారాయణ, జి.శ్రీనివాస్ తదితరులు మాదబోయిన నేరేళ్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూర్యారావుపేట మత్స్యకారులు..


వైఎస్సార్ సీపీలో చేరిన సూర్యారావుపేట మత్స్యకారులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

మండలంలోని సూర్యారావుపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద సూర్యారావుపేట వైఎస్సార్ సీపీ నాయకుడు సూరాడ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిక్కాడ కొండబాబు, సింహాద్రి, రాంబాబు, రాము, మేరుగు నారాయణమ్మ, ప్రసాద్, దూడ సంజీవ్, మైలపల్లి ధనరాజు, ఎరిపల్లి ప్రసాద్, గరికిన తాతాజీ, సూరాడ అనూక్, ఉమ్మిడి ప్రవీణ్, మైలపల్లి లక్ష్మి, అర్జిలి సింగన్న, అమ్మాజీ, అమ్మోరమ్మ తదితరులు చేరడంతో వారికి కన్నబాబు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

జనసేనపై నమ్మకం పోయింది

23వ డివిజన్ ప్రెసిడెంట్ సంతోషి


వైఎస్సార్ సీపీలో చేరిన సంతోషి దంపతులకు కండువా వేస్తున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి

బాలాజీచెరువు: జనసేన పార్టీపై నాయకుల్లో నమ్మకం పోయిందని, ఏ కార్యకర్తకు భరోసా లేక పార్టీ వీడుతున్నారని జనసేన పార్టీ 23వ వార్డు ప్రెసిడెంట్ పెదిరెడ్డి సంతోషి పేర్కొన్నారు. ద్వారంపూడి చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి సమక్షంలో ఆదివారం సంతోషి, ఆమె భర్త రాజేష్ చేరారు. కాకినాడ అర్బన్‌కు సంబంధించి జనసేన నాయకులకు భరోసా లేదని, ఇన్ని రోజులు వార్డుల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడ్డారని, ఇప్పుడు సరైన నాయకత్వం లేకపోవడంతో పార్టీ కనమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. ఇటీవల నిర్వహిస్తున్న ఉమ్మడి సమావేశాల్లో జనసేనపార్టీకి సంబంధించి మహిళ నాయకులకు గౌరవం లేదని, త్వరలో ఈ పార్టీ కనుమరుగవడం ఖాయమన్నారు. ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ధరిత్రి దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

బాలాజీచెరువు: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర పాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి పృథ్వీచరణ్ పేర్కొన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాంబమూర్తి నగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల జీవాలకు ఆధారమైన భూమిని కాపాడుకోవడం అందరికీ అవసరమైన, ప్లాస్టిక్ వంటి వాడకాన్ని తగ్గించి భూ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖ మాట్లాడుతూ పరిశ్రమల ద్వారా వెలువడే వ్యర్థాల వల్ల కంటే మనం వాడే ప్లాస్టిక్ వాడకాలు, మొక్కలును సంరక్షించలేకపోవడం వంటి వాటి వల్ల వాయు కాలుష్యానికి కారణమౌతున్నామని, భావి తరాలకు మంచి ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించాలన్నారు. ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న సేవలు కొనియాడారు. అనంతరం సమితి అధ్యక్షురాలు సురేఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి నరసింగరావు, కోశాధికారి సి.మురళీకృష్ణ, జేఎన్‌టీయూకే అధ్యాపకులు ఆలపాటి శ్రీనివాసరావు, బాబి, రామ్, కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజాభ్యుదయం


జి.భావారంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సర్పంచ్ గణేష్

కరప: ప్రజాభ్యుదయమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు గడప గడపకూ అందించారని, అటువంటి సంక్షేమ ప్రభుత్వానికి మద్దతుగా నిలబడి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన గ్రామ నాయకులతో కలసి ఇంటింటికీ తిరిగి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరింతగా జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా కన్నబాబు, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ నాయకులు పెన్నాడ వీర్రాజు, సలాది అంబేడ్కర్, తాతపూడి జీవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేళంగిలో ఎన్నికల ప్రచారం

కరప: మండలం వేళంగిలో ఆదివారం జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పర్యటించి జనసేన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, జేఎస్‌పీ నాయకుడు పంతం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే మత్స్యకారుల సంక్షేమం


వైఎస్సార్ సీపీలో చేరిన లారీ యూనియన్ కుటుంబాలతో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరికలు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేసినట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాకినాడలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన దాదాపు 600 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్నాథపురం ఏటిమొగ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న అరదాడి మహేష్ ఆధ్వర్యంలో సుమారు 400 మంది మహిళలు యువకులు టీడీపీ, జనసేనలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. 14, 15, 23, 24 డివిజన్ల నుంచి వీరంతా పార్టీలోకి తరలివచ్చారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ సకాలంలో మత్స్యకార భరోసాతో పాటు అనేక ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. ముఖ్యంగా కాకినాడ పట్టణంలో మత్స్యకార నివాసిత ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి చేశామన్నారు. గత పాలకులు మత్స్యకారులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసేవారని తమ ప్రభుత్వం వీరి అభ్యున్నతిని కాంక్షించి ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. ఓఎన్‌జీసీ పరిహారం వచ్చేలా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, పార్టీ నాయకులు ఫిలిప్ కన్నా, నగర పార్టీ ఉపాధ్యక్షుడు చక్కా చక్రవర్తి, పార్టీనాయకులు పేర్ల రజని, సంగాని నందం, చవాకుల రాంబాబు, భీమ రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల చేరిక

వైఎస్సార్ సీపీ నగర ఉపాధ్యక్షుడు చక్కా చక్రవర్తి ఆధ్వర్యంలో ఏటిమొగ ప్రాంతానికి చెందిన మత్స్యకారులు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఓఎన్‌జీసీ పరిహారం విషయంలో న్యాయం చేస్తామంటూ సీఎం జగన్ ప్రకటించిన నేపథ్యంలో సుమారు 60 మంది ఏటిమొగ నుంచి తరలివచ్చి పార్టీలో చేరారు.

27వ డివిజన్ నుంచి..

స్థానిక 27వ డివిజన్ నుంచి నగర ఉపాధ్యక్షుడు చక్కా చక్రవర్తి ఆధ్వర్యంలో సుమారు 25 మంది జనసేనను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వీరభద్రారెడ్డి సమక్షంలో..

స్థానిక జగన్నాథపురం ఏటిమొగ ప్రాంతానికి చెందిన మత్స్యకార నాయకులు కాట్రాడి ఆదినారాయణ ఆధ్వర్యంలో సుమారు 150 మంది జనసేనను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. జగన్నాథపురం పార్టీ కార్యాలయంలో వీరందరికీ రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు వీరభద్రారెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు అలాగే 21వ డివిజన్ నుంచి మాజీ కార్పొరేటర్ బొర్రా రమణ ఆధ్వర్యంలో లారీ యూనియన్ ప్రతినిధులు మట్టా శేఖర్, మట్టా దుర్గారావు, బాబ్జీ, శ్రీనివాస్‌తో పాటు సుమారు 25 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి.


ఏటిమొగ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



ఏటిమొగ సమావేశానికి హాజరైన మత్స్యకారులు

మామ కోసం అల్లుళ్ల ప్రచారం


ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆయన అల్లుళ్లు డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి

కాకినాడ: వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. ఎమ్మెల్యే ద్వారంపూడి ఇప్పటికే ఇంటింట ప్రచారానికి శ్రీకారానికి శ్రీకారం చుట్టగా, ఆయన సతీమణి మహాలక్ష్మి కూడా ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. ఇక రెండురోజులుగా ద్వారంపూడి కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని కూడా తండ్రికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. తాజాగా ఆదివారం ద్వారంపూడి అల్లుళ్లు డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి, డాక్టర్ హర్షవర్ధనరెడ్డి 41వ డివిజన్‌లో చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారంలో అడుగుపెట్టారు. మాజీ కార్పొరేటర్లు గోడి సత్యవతి, జేడీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉదయ్, డాక్టర్ హర్ష ఓటర్లను స్వయంగా కలసి మంచిచేసే ప్రభుత్వాన్ని, అందుబాటులో ఉండే ఎమ్మెల్యే ద్వారంపూడిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజా సమస్యలపై చిత్త శుద్ధితో పనిచేస్తూ, నిత్యం ప్రజల మధ్య ఉండే ద్వారంపూడిని మళ్లీ ఆశీర్వదిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుదంటూ ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోడి వెంకట్, దండుమహంతి లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యం తదితరులు వీరివెంట ఉన్నారు.

వంతెనతో తీరిన వెతలు


శిథిలావస్థకు చేరిన అరట్లకట్ట వంతెన (ఫైల్)


వంతెన పునర్నిర్మించాక..

- ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో అరట్లకట్ట వంతెన నిర్మాణం
- నిధులు మంజూరు చేసి సహకారం
- హర్షం వ్యక్తం చేస్తున్న మూడు మండలాల ప్రజలు

కరప: సుదీర్ఘ కాలం తర్వాత మూడు మండలాలను అనుసంధానం చేసే అరట్లకట్ట వంతెనకు మోక్షం కలిగింది. టీడీపీ నాయకులు నిర్లక్ష్యం వహించినా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో వంతెన పూర్తయిందని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కరప మండలం అరట్లకట్టవద్ద కొవ్వూరు కెనాల్‌పై ఉండే వంతెన శిథిలావస్థకు చేరడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, పొలాలకు వెళ్లి రావాలన్నా, పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ వంతెన కరప, పెదపూడి, కాకినాడ రూరల్ మండలాలను కలుపుతుంది. మండలంలోని ఆరు గ్రామాల ప్రజలు కాకినాడ పట్టణానికి వెళ్లేందుకు దగ్గరదారి, అటు పెదపూడి మండలం వెళ్లడానికి ఈ రహదారి ద్వారా ప్రయాణిస్తుంటారు. 2013లో ఈ వంతెన ఒకపక్కకు కుంగిపోయింది. అప్పటి ఎమ్మెల్యే కన్నబాబు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. తర్వాత 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినా, నిర్లక్ష్యం చేశారు. అప్పటి నుంచి ట్రాక్టర్లు, రెండెడ్లబండ్లు, కారులు వెళ్లేందుకు ఆటంకం ఏర్పడింది. అరట్లకట్ట రైతుల పంటపొలాలు వంతెన ఆవలవైపు ఉంటాయి. దీంతో పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి రైతులు, ప్రయాణాలు సాగించేందుకు ప్రజలు ఎనిమిది కిలోమీటర్లు చుట్టుతిరిగి వెళ్లాల్సివచ్చేది. తర్వాత 2019లో కన్నబాబు మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ప్రజల వినతి మేరకు ఈ వంతెన నిర్మాణానికి రూ.1.10 కోట్లు, కరప నుంచి ఇంద్రపాలెం వరకు రహదారి అభివృద్ధికి రూ.17.40 కోట్లు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో చాలా కాలం పనులు చేసేందుకు ముందుకు రాలేదు. ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశాలతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయించారు. అలాగే ఈ ఏడాది జనవరి నెలాఖరున ఆయన వంతెనను ప్రారంభించడంతో ప్రజలు రాకపోకలు మళ్లీ మొదలయ్యాయి.

ఎమ్మెల్యే చొరవతోనే వంతెన నిర్మాణం



టీడీపీ హయాంలో అరట్లకట్ట వంతెన నిర్మాణాన్ని పట్టించుకోలేదు. ఎమ్మెల్యేఎ కన్నబాబు నిధులు మంజూరుచేసినా, పనులు చేయడంలో కాంట్రాక్టర్ చాలాకాలం ఆలస్యం చేశారు. ప్రజలు, రైతుల ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో, పనులు పూర్తిచేయించారు. వంతెన నిర్మాణం పూర్తికావడంతో అందరికీ ఉపయోగంగా ఉంటోంది.

సోదగం సూరిబాబు, అరట్లకట్ట

ప్రజలు, రైతులు గుర్తుంచుకుంటారు



కొవ్వూరు కెనాల్‌పై వంతెన శిథిలావస్థకు చేరడంతో, టీడీపీ నాయకులను నిర్మాణం గురించి అడిగినా పట్టించుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కన్నబాబు నిధుల మంజూరు చేసి, అరట్లకట్ట వంతెన అందుబాటులోకి తీసుకురావడంతో ప్రజలు, రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరింది. ఎమ్మెల్యే కన్నబాబు చేసిన మేలు మూడు మండలాల ప్రజలు గుర్తుంచుకుంటారు.

వాసంశెట్టి శ్రీనుబాబు, సర్పంచ్, గొడ్డటిపాలెం

బ్రాహ్మణులు నిర్భయంగా ఓటు వేయాలి


రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

బోట్‌క్లబ్: బ్రాహ్మణులు నిర్భయంగా ఓటు వేసినప్పుడు మనం ఏదైనా సాధించగలమని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ ఐవీ రావు పిలుపునిచ్చారు. స్థానిక విద్యుత్‌నగర్‌లో ఒక ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బ్రాహ్మణుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో బ్రాహ్మణుల ఓటింగ్ నిర్ణయాత్మక శక్తిగా ఉందన్నారు. మన మధ్య ఉన్న అవగాహన లోపం వల్ల అవి కార్యచరణ దాల్చడం లేదన్నారు. బ్రాహ్మణ సంఘాల ప్రాముఖ్యత అనవసరమని, ఎవరైతే తమ వృత్తుల్లో ఇతర బ్రాహ్మణులకు అండగా నిలుస్తారో అటువంటి బ్రాహ్మణులకు ఇతర బ్రాహ్మణులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది అయ్యగారి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులపై దాడులు జరిగినప్పుడు బ్రాహ్మణులకు అండగా సంఘాలు స్పందిస్తే, దానికి అనుగుణంగా రాజకీయ నాయకులు స్పందిస్తారని, అప్పుడు మనకు మరింత అండ లభిస్తుందన్నారు. ముంజులూరి విశ్వేశ్వర రావు మాట్లాడుతూ సమాజ హితం కోరే బ్రాహ్మణుల మీద దాడులు చేయడం దుర్మార్గమని, దాన్ని నివారించాలంటే మన మధ్య ఐక్యత అవసరమని పిలుపునిచ్చారు. అనంతరం బ్రాహ్మణులందిచే ఓటు వేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చల్లా నిరంజన్ శ్రీనివాస్, ఆకెళ్ల మురళీకృష్ణ సమావేశంలో రాయవరపు ప్రభాకరరావు, జమలమడక రామశర్మ, పద్మనాభ స్వామి, సీహెచ్‌వీవీ రమణమూర్తి, కందాళం రవి, భమ్మిడిపల్లి మూర్తి, శివమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ మున్సిపల్ చైర్మన్


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న సీఎం జగన్

పిఠాపురం: పిఠాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ కరణం చిన్నారావు, గొల్లప్రోలు టీడీపీ నేత లింగం అర్జున్ ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి సీఎం వైఎస్ జగన్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వంగా గీత విజయానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల అదనపు పరిశీలకుడు షేక్ బాబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.